క్లుప్తంగా

వైభవంగా గొల్లాలమ్మ తీర్థం



పినపళ్లలోని గానుగచెట్టు వద్ద నెత్తిన గరగ ధరించి గవ్వనృత్యం చేస్తున్న కళాకారుడు

ఆలమూరు: పినపళ్లలో వేంచేసిన గొల్లాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. గొల్లాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో పోటెత్తారు. అలాగే ఆసాదులు ప్రదర్శించిన గవ్వ నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గొల్లాలమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన మహిళల గరగ నృత్యాలు, విచిత్ర వేష ధారణ, కోయ నృత్యాలు భక్తులను మంత్రము గ్ధులను చేసింది. అమ్మవారికి సంప్రదాయంగా వస్తున్న ఆచార వ్యవహారాల్లో భాగంగా గరగ రూపంలో ఉన్నవారిని చర్మ వాయిద్యాల మధ్య తాటిపట్టెలపై గ్రామోత్సవం నిర్వమించి, ఉయ్యాలలో ఊపడం స్థానికులను అమితంగా ఆకట్టుకుంది. అమ్మవారు చీరలపై నడిచి పుట్టింటికి వెళ్లి వేద మంత్రోచ్చారణల మధ్య ఆతిథ్యాన్ని స్వీకరించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

ఘనంగా సిరిబొమ్మ తీర్థం

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామదేవత మహాలక్ష్మమ్మ జాతరలో భాగంగా మంగళవారం సిరిబొమ్మ తీర్థం అంగరంగ ఘనంగా జరిగింది. డప్పు వాయిద్యాల నడుమ భుజంపై యువకులు సిరిబొమ్మను ఇంటింటికీ ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పాతిన రాటకు సిరిబొమ్మను కట్టి గాల్లో తిప్పారు. ఒక వైపు సిరిబొమ్మ, మరో వైపు మనిషి గాలిలో తిరుగుతూ సిరిబొమ్మ తీర్థం సంప్రదాయబద్ధంగా జరిగింది. గాల్లో తిప్పుతున్న సిరిబొమ్మను భక్తులు అరటి పండ్లతో కొడుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువలా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. అనంతరం ఏర్పాటు చేసిన సరిగమప ఆర్కెస్ట్రా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవాలు సంపూర్ణమయ్యాయి.

అంతర్వేదిలో కెరటాల ఉధృతి

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌లో అల్పపీడన ప్రభావానికి అమావాస్య ఘడియలు తోడవ్వడంతో సముద్ర కెరటాల ఉధృతి మంగళవారం పెరిగింది. కెరటాలు సాధారణ స్థాయికి మించి ఎగసి పడుతున్నాయి. దీంతో కెరటాలు తీరాన్ని దాటుకుని సుమారు 200 మీటర్ల వరకూ చొచ్చుకు వస్తున్నాయి. కెరటాల దాటికి తీరాన్ని ఆనుకుని ఉన్న పల్లపు ఏరియాలు ఉప్పునీటితో జలమయం అవుతున్నాయి.

పీహెచ్‌సీని వినియోగంలోకి తేవాలి



విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేసిన బీజేపీ శ్రేణులు

సఖినేటిపల్లి: మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న పీహెచ్‌సీ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి రోగులకు వినియోగంలోకి తెచ్చే విధంగా చూడాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు, బీజేపీ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను వారు కలసి పై విధంగా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఇరుకు గదుల్లో పీహెచ్‌సీని తాత్కాలికంగా నిర్వహిస్తున్నారని, ఇరుకు గదులతో రోగులు, గర్భిణులు అవస్థలు పడుతున్నారన్నారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, కన్వీనర్ అడబాల రాంబాబు, గంటా నాయుడు, దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

హైఓల్టేజీతో గృహోపకరణాల దగ్ధం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో సోమవారం రాత్రి విద్యుత్ సరఫరాలో హై ఓల్టేజీ రావడంతో టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు దగ్ధమయ్యాయి. గ్రామంలో సుమారుగా 8 టీవీలు, 6 ఏసీలు, 9 ఫ్రిజ్‌లు, 12 ఫ్యాన్లు కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వస్తే హై ఓల్టేజ్ లేదా లో వోల్టేజీలతో సతమతమవుతున్నామని విద్యుత్ వినియోగదారులు వాపోయారు. ఇటువంటి సమస్యలు రాకుండా సత్వరమే విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పీవీ మెరకలో తాటాకిళ్లు..

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరక సబ్‌స్టేషన్ రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో కోళ్ల వెంకాయమ్మ, మంగాయమ్మలకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. కట్టెల పొయ్యి నుంచి ఎగిసిన మంటలు వల్ల ప్రమాదం జరిగినట్టు సమాచారం. రూ.5 లక్షలు వరకూ ఆస్తి నష్టం ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బాధితులు కోరారు. కాగా సమాచారం అందుకున్న రాజోలు ఫైర్ స్టేషన్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఈ ఏడాదైనా సాయం అందేనా?

- త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్
- అందని 'అన్నదాత సుఖీభవ'
- కూటమి పాలనలో ఎదురు చూపులు?
- క్లస్టర్ పరిధిలో గత ఐదేళ్లలో రైతులకు రూ.389.23 కోట్లు

కొత్తపేట: ఆరుకాలం కష్టించి పంటలు సాగు చేసేవాడు రైతు.. అలాంటి రైతు పరిస్థితి నేడు దయనీయంగా మారింది. పంటలకు క్రిమి కీటకాలలు, చీడపీడలతో దిగుబడి తగ్గి నష్టపోవడం, పండింది పండినట్టుగా ప్రభుత్వం కొనకపోవడం, జాప్యం చేయడం, ఈలోపు వర్షాల కారణంగా పంట దెబ్బతినడం, ప్రకృతి వైపరీత్యం ఇలా ఏదో ఒక కారణంతో రైతులు నష్టపోతున్నారు. అలాంటి రైతులకు ప్రభుత్వం నుంచి కొంత మేరకు ఆర్థిక అండదండలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా పేరుతో ఆర్థిక అండదండలు అందించి రైతులను ఆదుకుంది. కానీ నేటి కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి అయినా, మళ్లీ ఖరీఫ్ సీజన్ వస్తున్నా రైతులకు అన్నదాత సుఖీభవ ఊసెత్తడం లేదు. గత ఖరీఫ్, రబీలో ఎలాగూ ఇవ్వలేదు. ఈ ఖరీఫ్‌లోనైనా రైతులకు అన్నదాత సుఖీభవ అందుతుందా.. అని రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

జగన్ పాలనలో రైతు పథకాలు



పలివెలలో అకాల వర్షానికి కళ్లంలో తడిసిన ధాన్యం (ఫైల్)

2019 నుంచి 2024 వరకూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో క్రమం తప్పకుండా రైతు ప్రయోజన పథకాలు అమలు చేస్తూ రైతులను ఆదుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ అధినేత రైతులకు భరోసా హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన వెంటనే రైతు భరోసాతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేసి రైతులను ఆదుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల కష్టాలు చూసి రైతులకు అండగా ఉండాలని భావించింది. అందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి రైతులకు రైతు భరోసా అందించింది.

అన్నదాత సుఖీభవ కోసం రైతుల ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది పూర్తవుతోంది. ఎన్నికల్లో రైతులకు రూ.20 వేలు అన్నదాత సుఖీభవ రూపంలో రైతులకు ఏటా అందిస్తామని చెప్పారు. కానీ నేటికి ఏడాది పూర్తయింది. రెండో సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ మరో నెలలో ప్రారంభం కానుంది. అయినా నేటికి రైతుల ఖాతాకు ఒక్క పైసా పడలేదు. అలాగే ప్రభుత్వం ఇస్తుందన్న ఆలోచన కలగడం లేదు. దీంతో రైతులు అసలు కూటమి పాలనలో రైతులకు అన్నదాత సుఖీభవ వస్తుందా రాదా? అన్న ఆలోచనలో రైతులు ఉన్నారు.

క్లస్టర్ పరిధిలోని వైఎస్సార్ సీపీ హయాంలో రైతు భరోసా వివరాలిలా..

నియోజకవర్గం	రైతులు	రైతు భరోసా (రూ.కోట్లలో)
కొత్తపేట	33,043	149.57
పి.గన్నవరం	32,092	122.52
రాజోలు	28,448	117.14
మొత్తం	90,583	389.23

రైతులకు అన్యాయం

2024 ఖరీఫ్, రబీ సీజన్లో వరి పంట సాగు చేసిన రైతులు చాలా వరకు నష్టపోయారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరతో రైతుల నుంచి పంట కొనుగోలుకు సంబంధించి టార్గెట్‌లు పెట్టి కొనుగోలులో జాప్యం చేసింది. టార్గెట్ల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం వలన ధాన్యం ఎక్కువ రోజులు కళ్లాల్లోనే ఉండిపోవడం. అకాల వర్షాలు కురవడం, ధాన్యం తడిసిపోవడంతో తీవ్ర నష్టాలు చవిచూశారు.

కూటమి మాట నిలబెట్టుకోవాలి



గత ఏడాది ఎన్నికల ముందు రైతులకు రూ.20 వేలు అన్నదాత సుఖీభవ రూపంలో అందిస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వమేర్పడి ఏడాది పూర్తి కావస్తున్నా రైతులకు ఒక్క పైసా విదల్చలేదు. హామీ ఇచ్చినట్లుగా రూ.20 వేలు రైతులకు అందించి మాట నిలుపుకోవాలి.

– పెదపూడి బాపిరాజు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం, కొత్తపేట

రైతులకు అండగా జగన్



రైతుల కష్టం తెలిసిన నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. అందుకే ఆయన నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన ఏడాది నుంచే రైతులకు రైతుభరోసా ఇచ్చారు. ఐదేళ్లు రైతులకు అండగా నిలిచారు. నేడు రైతులు కూటమి పాలనలో అన్నదాత సుఖీభవ కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

– భూపతిరాజు సత్యనారాయణరాజు, రైతు, గంటి

నగరం ఏఎంసీ పాలకవర్గం నియామకం



నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి

మామిడికుదురు: నగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. 20 మంది సభ్యులతో పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఏడాది పాటు పదవిలో కొనసాగుతుందని ఆదేశాల్లో పేర్కొన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను గౌరవ చైర్మన్‌గా నియమించారు. మొగలికుదురుకు చెందిన జనసేన నాయకురాలు పెనుమాల లక్ష్మిని చైర్మన్‌గా నియమించారు. మొండెపులంకకు చెందిన గుడాల వెంకటరమణ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. సభ్యులుగా బండారు శ్రీను (పి.గన్నవరం), బొక్కా లలితాదేవి (పెదపట్నం), కండిబోటి సత్య ఈశ్వరి (పి.గన్నవరం), కుంపట్ల మల్లికార్జునరావు (పెదపట్నంలంక), లంకే వెంకటలక్ష్మి (ఎల్.గన్నవరం), లూటుకుర్తి సత్యనారాయణ (కె.ముంజవరం), నిమ్మకాయల వెంకటలక్ష్మి (కె.ఏనుగుపల్లి), నూకల వెంకటేశ్వరరావు (నాగుల్లంక), పెంటా ఏసుకుమారి (ఊడిమూడి), పినిశెట్టి రామచంద్రశేఖర్ (ఆదుర్రు), అడబాల నాగమణి (కె.ముంజవరం), చిట్టాల రామజోగేశ్వరరావు (ఎల్.గన్నవరం), పితాని వెంకటేశ్వరరావు (పాశర్లపూడిలంక), నగరం సర్పంచ్ జాలెం రమణకుమారితో పాటు మరో ముగ్గురు అధికారులను సభ్యులుగా నియమించారు.

గొడుగుల పంపిణీ

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. అనూస్ సంస్థ వ్యవస్థాపకుడు చింతా శ్యామ్‌కుమార్, ఆయన కుటుంబ సభ్యుల సేవా కార్యక్రమాల్లో భాగంగా నిత్య జీవనంలో పనులకు వెళ్లే పేద, సామాన్య కూలీలు, చిరు వ్యాపారులు ప్రస్తుత వేసవి సీజన్‌లోఉష్ణ తాపం నుంచి రక్షణ పొందేందుకు నెమలపురి కుటుంబ సభ్యుల సౌజన్యంతో గొడుగుల పంపిణీ చేశారు. ర్యాలి సందర్శకులకు తమ చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ మోహిత్ సీత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక లారీల అప్పగింత



అయినవిల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన మూడు ఇసుక లారీలు

అయినవిల్లి: ముక్తేశ్వరం-కె.గంగవరం మండలంలోని కోటిపల్లిరేవు నుంచి ఏ విధమైన రికార్డులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఇసుక లోడింగ్‌కు సంబంధించిన సరైన పత్రాలు చూపకపోవడంతో లారీలను అదుపులోకి తీసుకుని అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. తదుపరి చర్యలు కోసం పై ఉన్నతాధికారులకు తెలిపరచినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు.

వైభవంగా తాటమ్మ తల్లి తీర్థం

పి.గన్నవరం: గ్రామంలో వేంచేసిన తాటమ్మ తల్లి తీర్థం మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు, వారి ఆడపడుచులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ట్రస్టీ సుంకర సత్యసాయిబాబు (రాంబాబు) వివిధ ఏర్పాటు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కళాశాలలో అవకతవకలపై ఆర్జేడీ విచారణ



మలికిపురంలో విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ కృష్ణాజీ

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ఎయిడెడ్ కళాశాలలో అవకతవకలు జరిగాయని విచారణ చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేసిన ఫిర్యాదుపై విద్యా శాఖ రీజినల్ డైరెక్టర్ పీవీ కృష్ణాజీ మంగళవారం విచారణ నిర్వహించారు. కళాశాలలో పాలకవర్గంతో ఆయన మాట్లాడారు. కళాశాల రికార్డులను ఆయన తనిఖీ చేశారు. అలాగే కళాశాల యాజమాన్యం జీతాలు ఇవ్వకపోవడంతో గత 256 రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న అధ్యాపకులతో కూడా ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో నిధులు దుర్వినియోగంపై విచారణ చేస్తున్నామన్నారు. అలాగే అధ్యాపకుల నుంచి లిఖితపూర్వక లేఖను కూడా కోరామన్నారు. వివరాలను ఉన్నత విద్యా శాఖకు నివేదిక ఇస్తామన్నారు. అలాగే కళాశాలకు సంబంధించి స్థానికులు కోర్టుకు వెళ్లిన నేపథ్యంలో కోర్టు తీర్పు వెలువడే వరకూ ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అప్పటివరకూ పాలక వర్గమే కళాశాల నడపాల్సి ఉంటుందన్నారు. కళాశాల డిగ్రీ విధానంలో విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లే సమయంలో కొన్ని సబ్జెక్టులకు ప్రాధాన్యతా క్రమంలో నూతన విధానం అమలు చేసేందుకు ఉన్నత స్థాయిలో చర్చ నడుస్తుందని ఆయన అన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన సదస్సు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో కిశోరి వికాసం–2పై మంగళవారం కౌమారదశ బాలికలకు అవగాహన సదస్సు జరిగింది. స్థానిక గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కండిబొట్ల శ్రీనివాసు నేతృత్వంలో గ్రామ సచివాలయ, అంగన్‌వాడీ ఆశ సిబ్బంది పాల్గొని 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలికలకు వివిధ అంశాలపై శిక్షణను ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళల అక్రమ రవాణా గురించి వారు వివరించారు. రుతుక్రమంలో సంభవించే పలు రుగ్మతల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో బాలికల ఒకరినొకరు పరిచయం చేసుకుని ఉల్లాసంగా గడిపారు. ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ప్రయోజనం చేకూరేలా ఉండాలి

అంబాజీపేట: రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఉద్యోగులు పనితీరు ఉండాలన్నారు. డివిజనల్ సహకారశాఖాధికారి ఎ.రాధాకృష్ణారావు అన్నారు. అంతర్జాతీయ సహకారం సంవత్సరం–2025 సందర్భంగా అంబాజీపేట సహకార సంఘం కార్యాలయంలోని మేనేజింగ్ కమిటీ సభ్యులకు 'సామర్థ్య నిర్మాణం– సుపరిపాలన' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు, సభ్యులకు మెరుగైన సేవలు అందాలన్నారు. ప్రస్తుతం పర్సన్‌–ఇన్‌చార్జిలతో సహకార సంఘాలు కొనసాగుతున్నాయన్నారు. సహకార సంఘాలు ఆర్థికపురోభివృద్ధి సాధించేందుకు ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. రైతులు, సభ్యులకు సత్వర సేవలు అందించేలా ప్రణాళికలు ఉండాలని, రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలన్నారు. సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని సూచించారు. డివిజనల్ సహకార ఆడిటర్ డి.విజయలక్ష్మి, జిల్లా సహకార శిక్షణ ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, బ్రాంచి మేనేజర్ నాగేశ్వరరావు, అంబాజీపేట సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఐ.శ్రీనివాస్, సీఈవో కుంపట్ల అయ్యప్పనాయుడు, జిల్లాలోని సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

దోమల పట్ల నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: దోమల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే అనారోగ్యానికి గురవుతామని ఎన్‌వీబీడీసీపీ సబ్ యూనిట్ అధికారి ఎన్‌వీ రామారావు అన్నారు. ఇసుకపూడిలో డెంగీ వ్యాధి లక్షణాలు, దోమల నియంత్రణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నివాస గృహాల్లో ఉన్న ఫ్రిజ్‌లు, ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నీటి నిల్వలు ఉన్న చోట దోమలు అధికంగా చేరతాయన్నారు. దాంతో డెంగీ దోమ ఏర్పడి ప్రజలకు హానీ కలిగిస్తాయన్నారు. వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అంబాజీపేట పీహెచ్‌సీలో లేబొరేటరీ, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బి.అప్పారావు, హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ, ఎల్‌టీ రవితేజ, ఏఎన్‌ఎం మణికాంత, ఆశాలు పాల్గొన్నారు.

సర్పంచ్ సుభాష్‌కు సత్కారం

ఆలమూరు: రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డు గ్రహీత, గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్‌కు ఘన సత్కారం జరిగింది. స్థానిక పశు వైద్యుడు ఈదల శ్రీనివాసు మంగళవారం పినపళ్లలోని సర్పంచ్ సుభాష్ నివాసానికి వెళ్లి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ప్రతిష్టాత్మక అవార్డు రావడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు, అవార్డులు సాధించి గ్రామాభివృద్ధికి విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు.

పంట కాలువల అభివృద్ధి పనులు



నేదునూరులో పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న ఇరిగేషన్ అధికారులు

అయినవిల్లి: పంట కాలువలు, బోదెల అభివృద్ధి పనులు కొత్తపేట నీటి వినియోగ సంఘం పరిధిలోని నేదునూరులో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. నేదునూరు గుమ్మడివారిపేట పరిధిలో పంటకాలువను రూ.4.20 లక్షలతో పూడికతీత పనులు చేపట్టారు. అలాగే మండలంలోని చింతనలంక లాకుల వద్ద రూ.4 లక్షలతో షట్టర్ మార్పు చేయడం, రూ.4 లక్షలతో పూడికతీత పనులు, రూ.10 లక్షలతో సిరిపల్లి– అనాతవరం పంటకాలువలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చేపడుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

ఆలమూరు: చొప్పెల్ల గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుడు కాళ్ళకూరి కాశీ శేఖర్ బాబు ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య ఆలయ పురోహితుడు కాళ్ళకూరి రవితేజశర్మ బ్రహ్మత్వంలో శైవాగమ పద్ధతిలో ఈ విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది. దాతల సహకారంతో నిర్మించిన అమ్మవారి నూతన ఆలయంలో ఈనెల 31న విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని ఆలయ కమిటీ మంగళవారం తెలియజేసింది. అలాగే భారీ అన్నసమారాధనను ఏర్పాటు చేయనున్నామన్నారు.

రావులమ్మకు సేవ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామ దేవత రావులమ్మ అమ్మవారి జాతర పురస్కరించుకుని ప్రసాద్‌నగర్ కాలనీ వాసులు అమ్మవారి సేవను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి పూజా ఘటాలకు హారతులిచ్చి, చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సేవలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. యువకుల కేరింతల నడుమ అమ్మవారి సేవ వైభవంగా సాగింది.

రెండో రోజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు శివారు శిరసవల్లి సావరంలో కొలువైన కొమారమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను మంగళవారం గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి వేదపండితులు విశేష పూజలు జరిపారు. వేదపండితులు, రుత్వికుల వేదఘోష మధ్య అమ్మవారి ప్రాంగణం శోభిల్లింది. అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నసమారాధన జరిపారు.

అంతర్వేది ఆలయంలో యోగా కార్యక్రమం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎండోమెంట్స్ అధికారుల ఆదేశాలపై మంగళవారం యోగా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగా గురువు నేతృత్వంలో ఒక రోజు యోగాపై శిక్షణ ఇచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, సర్పంచ్ కొండా జాన్‌బాబు, దేవస్థానం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా వచ్చే నెల 3, 16 తేదీల్లో కూడా ఆలయంలో యోగా శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఏసీ సత్యనారాయణ అన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖలకు చెందిన ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయం నుంచి 216వ నంబర్ జాతీయ రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. యోగా వల్ల మంచి దృఢమైన ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాలో భాగస్వాములు కావాలని అభిలషించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాస్, ఏఓ కె.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ ఉద్యోగులతో పాటు పలు శాఖలకు చెందిన ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలమూరు: జూన్ 21న నిర్వహిస్తున్న యోగా డేను విజయవంతం చేసే విధంగా అందరూ సమష్టి కృషి చేద్దామని రామచంద్రాపురం డివిజనల్ పంచాయతీ అధికారి, ఎంపీడీఓ ఎ.రాజు పిలుపునిచ్చారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగా డే శిక్షణ సదస్సు జరిగింది. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డీఎల్‌పీఓ రాజు పాల్గొని ప్రసంగించారు. అనంతరం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టర్ ద్వారా ఎంపీడీఓ దృశ్య రూపంలో గ్రామ సచివాలయ ఉద్యోగులకు శిక్షణ అందించారు. గ్రామ స్థాయిలో యోగా అభ్యాసన కోసం దరఖాస్తు చేసుకున్న ఔత్సాహికులందరికీ పూర్తి స్థాయి శిక్షణ అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను, ఆవశ్యకతను వివరించాలన్నారు. వచ్చే నెలలో నిర్వహించే యోగా డేలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజ్ఞప్తి చేశారు. గ్రామ కార్యదర్శులు ఎస్.వీ రాజు, వి.వేణి, జె.అయ్యన్న, వైద్య ఆరోగ్య సేవల సిబ్బంది పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం యోగాంధ్రలో భాగంగా సచివాలయ ఉద్యోగులకు ఒక రోజు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు మన్నె సత్యనారాయణ యోగాలో మెళకువలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో ప్రధానంగా సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణామాయం, ధ్యానంపై తదితర వాటిపై యోగా గురువు మన్నె అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కె.సూర్యనారాయణ, పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేదునూరులో..

అయినవిల్లి: నిత్యం యోగా సాధన చేయడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని కమబద్ధికరించుకోవచ్చని నేదునూరు పంచాయతీ కార్యదర్శి ఎండీ అన్వర్ తెలిపారు. నేదునూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కార్యాలయ, సచివాలయ సిబ్బందికి అన్వర్ అవగాహన కల్పించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయ అర్చక, ఆలయ సిబ్బందికి యోగా గురువులు యోగా ఆసనాలపై మెళకువలు నేర్పారు.



అంతర్వేదిలో యోగా శిక్షణలో పాల్గొన్న ఏసీ సత్యనారాయణ, సిబ్బంది



మామిడికుదురులో నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీ



ఆలమూరులో యోగా శిక్షణ ఇస్తున్న డీఎల్‌పీఓ రాజు